నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | జనవరి 25, 2024 | www.navatelangana.com

3.5 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఓ బైక్ పై గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి సుమారు 3.5 కిలోల గంజాయిని నందిపేట్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. స్వామి వివేకానంద చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఐతే ఓ వాహనంపై అనుమానం రావడంతో పోలీసులు అతనిని విచారించే సరికి నిజం బయటపడింది. వీరు మండలంలో ఎక్కడ విక్రయాలు చేపడుతున్నారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వీరు జిల్లా కేంద్రానికి చెందిన జీలకర్ర ప్రసాద్, విద్య సాగర్.. వీరి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ చెప్పారు.

విద్యుద్ఘాతంతో ఒకరు మృతి



మృతిచెందిన మల్లేశ్

నవతెలంగాణ-మోర్తాడ్

విద్యుద్ఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని ధర్మనోల్ల నరసయ్య వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అనిల్ రెడ్డి వివరాల ప్రకారం.. నరసయ్య తన వ్యవసాయ క్షేత్రంలో అడవి పందులు రాకుండా ఉండడానికి విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేశాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన అగ్గి మల్లేశ్(46) అటుగా వెళ్లగా.. విద్యుత్ వైర్‌లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు.



బారికేడ్‌లు అడ్డుగా పెట్టి రోడ్డు మూసివేత

మాధవ్‌నగర్ రైల్వేగేటు రోడ్డు మూసివేత

- బ్రిడ్జి పనుల నేపథ్యంలో అధికారుల చర్యలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ నగరంలో మాధవనగర్ వద్ద రైల్వే గేటును నేటి (గురువారం) నుంచి మూసివేస్తున్నట్టు అధికారులు తెలిపారు.అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణ పనులు కొనసాగుతున్న విషయం విధితమే. అయితే రైలు పట్టాల సమీపంలో ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ సమయంలో వాహనాల రాకపోకల వల్ల పనులకు ఆటంకం కలగకుండా, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రైల్వే గేటు, రోడ్డును ఫిబ్రవరి 20వ తేదీ వరకు పూర్తిగా మూసివేస్తున్నట్టు తెలిపారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు రాకపోకలు సాగించే వారు మాధవనగర్ బైపాస్ మీదుగా కంఠేశ్వర్ వరకు చేరుకోవచ్చు. దీంతో పాటు బోర్గాం మీదుగ మోపాల్, కంజర్, ముళ్లంగి, ఘన్‌పూర్ మీదుగా జాతీయ రహదారికి చేరుకోవచ్చు. పనులు జరుగుతున్న దృష్ట్యా వాహనదారులు సహకరించాలని అధికారులు కోరారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం కొనసాగుతున్న పనులు

స్కీమ్ వర్కర్ల హక్కుల
పరిరక్షణకు చర్యలు తీసుకోండి

- ప్రభుత్వ స్కీమ్‌లను రక్షించండి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీ కార్యాలయంలో వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీముల రక్షణకు, స్కీం వర్కర్ల హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్ గౌడ్ నూర్జహాన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, కస్తూరిభా గ్రామీణ ఉపాధి హామీ, వివిధ స్కీమ్‌లు, ఐకెపి విఓఏలు, సర్వశిక్షా అభియాన్ తదితర 72 స్కీముల్లో దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారని తెలిపారు. ఇందులో దేశంలో ఒక కోటి మంది, తెలంగాణ రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది స్కీమ్ వర్కర్లు గత 40 సంవత్సరాలకు పైగా పని చేస్తున్నారని తెలిపారు. 'ఈ స్కీమ్‌ల ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాలలో ఉన్న అత్యంత పేదలకు అందించడంలో స్కీమ్ వర్కర్లు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే అత్యధికమంది ఉన్నారు. అత్యంత కీలక పథకాల నిర్వహణలో పనిచేస్తున్న వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఒకవైపు ఆకాశన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, మరోవైపు చాలీచాలని వేతనాలతో స్కీమ్ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మోయలేని పని భారంతో కునారిల్లుతున్నారు. 2013 మే నెలలో 45 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కీమ్లు ప్రైవేటీకరణ ఆపాలని తీర్మానం చేసింది. ఈ నిర్ణయం జరిగి 10 సంవత్సరాలు దాటింది. అయినా కేంద్ర ప్రభుత్వం వీటిని అమలు చేయకపోవడం వల్ల స్కీమ్ వర్కర్లు తీవ్రంగా నష్టపోతు న్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీమ్లను నిర్వీర్యం చేసే అనేక ప్రయత్నాలు చేస్తున్నది. స్కీమ్లకు బడ్జెట్‌ను 60 శాతానికి తగ్గించింది. స్కీమ్‌లను ఎప్పుడైనా నిలుపుదల చేసే విధంగా అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నది. దీని అమలు కోసం గతంలో ఉన్న ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, దీని స్థానంలో నీతి ఆయోగ్ తెచ్చింది. గత కొంత కాలంగా స్కీమ్లను స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయం చేస్తున్నది. ఈ నష్టదాయకమైన నిర్ణయాలు అమలు జరిగితే స్కీమ్ వర్కర్ల ఉపాధితో పాటు పేద ప్రజలకు స్కీమ్లు ద్వారా అందుతున్న సేవలు దూరమవుతాయి. దేశంలో ఆకలితో అలమటించే వాళ్ళ సంఖ్య, పేదరికం, నిరుద్యోగం ఈ కాలంలో అనేక రెట్లు పెరిగాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రజలకు స్కీమ్ సేవలు మరింత అవసరం. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న సమస్యలు, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఈ పరిస్థితుల్లో స్కీముల రక్షణ, స్కీమ్ వర్కర్ల హక్కుల సాధనకై స్కీమ్ వర్కర్ల ఆలిండియా కన్వెన్షన్ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని స్కీమ్ వర్కర్లందరూ బుధవారం వివిధ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు' తెలిపారు. స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ వినతి పత్రాన్ని పంపించి, పరిష్కారం కోసం కృషి చేయాల్సిందిగా కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, వివిధ స్కీమ్‌ల వర్కర్‌లు

'ఐసిడిఎస్, ఎండిఎంఎస్, ఎన్హెచ్ఎం తదితర స్కీమ్లు ప్రైవేటీకరణ ఆపాలి. బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి. ఎన్ఐపి-2020, డిజిటల్ హెల్త్ మిషన్‌ను ఉపసంహరించుకోవాలి. స్కీమ్ వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలి. 45వ ఐఎల్సి సిఫారసుల ప్రకారం స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనం రూ.26,000/-లు చెల్లించాలి. స్కీమ్ వర్కర్లందరికీ నెలకు రూ.10,000/-లు పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐఐ, గ్రాట్యుటీ మొదలైన అన్ని సామాజిక భద్రతా చర్యలను అమలు చేయాలి.అన్ని రాష్ట్రాల్లోని వివిధ రకాల స్కీమ్ వర్కర్లకు ఒకే విధమైన సర్వీస్ రూల్స్ ఉండాలి. 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలి. స్కీమ్ వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని' డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, భూమవ్వ అనీష్, అనసూయ, సరస్వతి, సరిత స్వప్న, శోభ, సునీత, ఆశా, యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, ఉపాధ్యక్షురాలు సుకన్య, స్వప్న, మధ్యాహ్న జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు



మొక్క నాటుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దామని, వారి బంగారు భవితకు పునాది వేద్దామని తెలిపారు. ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు ఇంటికి వెలుగుగా భావించాలని సూచించారు. ఆడపిల్లలను చదివించి, ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా చూడాలన్నారు. ఆడపిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. మొక్కలు నాటడం వల్ల భావితరాలకు ప్రాణవాయువు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వద్ధుల సంక్షేమ అధికారి బావయ్య, సిడిపివో శ్రీలత, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- అర్బన్ ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఎమ్మెల్యేకు సమస్యలు వినవిస్తున్న స్థానికులు

తమ సమస్యలు పరిష్కరిం చాలంటూ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు వినతులు వెల్లువెత్తుతు న్నాయి. పలు డివిజన్‌ల పర్యటనలు చేపడతుండగా తమ కాలనీలను సందర్శించి సమస్యలు పరిష్కరించా లని కోరుతున్నారు. నిజామాబాద్ నగరంలోని 7వ, 8వ డివిజన్‌లలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ బుధవారం మున్సిపల్ కమిషనర్ మకరందుతో పాటు బీజేపీ నాయకులతో పర్యటించారు. ఉదయం ఏడు గంటలకు 7వ డివిజన్‌లో పర్యటన ప్రారంభించారు. కానీ ఊహించని విధంగా ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. డివిజన్‌లో ఏ కాలనీకి వెళ్లినా సార్ మా కాలనీకి రండి. సంవత్సరాలుగా రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు అని ఫిర్యాదులు చేశారు. పట్టుబట్టి మరీ ఆయా కాలనీలకు తీసుకెళ్లారు. 7 గంటలకు ప్రారంభమైన పర్యటన ఉదయం 9.30 నిమిషాలైనా ఒక డివిజన్‌లోనే పర్యటన పూర్తి కాలేదు. దీంతో చేసేది లేక మరో డివిజన్ పర్యటన మధ్యంతరంగా నిలుపుదల చేశారు.

ఎమ్మెల్యే కారు నిలుపుదల...

8వ డివిజన్‌లో పర్యటన అర్ధంతరంగా నిలిపేయడంతో ఈ డివిజన్‌లోని సీతారాంనగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే కారును మార్గమధ్యంలో నిలుపుదల చేయించారు. తమ గల్లీకి వచ్చి రోడ్డు, డ్రైనేజీ పరిస్థితి చూడాలని కోరారు. ముఖ్యంగా తమ గల్లీ రోడ్డు 8వ, 27వ డివిజన్ మధ్యలో ఉందని, రెండు డివిజన్ల కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని వాపోయారు. గల్లీ చుట్టుపక్కల రోడ్ల నిర్మాణం పూర్తయిందని, కానీ తమ గల్లీలో మాత్రం రోడ్డు వేయడం లేదని, ఇదేంటని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. పైగా గల్లీలో ప్రమాదకరంగా హైటేన్షన్ లైన్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని తీసివేయించాలని కోరారు. అయితే ఉదయం నుంచి డివిజన్‌లలో పర్యటించానని, త్వరలో రెండు, మూడు రోజుల్లో మళ్లీ కాలని వస్తానని చెప్పారు. పైగా ఒక కాలనికి వచ్చి మరో కాలనీకి రాకపోతే సమస్యలు వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. దీంతో చేసేదిలేక అసంతృప్తితో మహిళలు వెనుదిరిగారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి
30 శాతం నిధులు కేటాయించాలి

- విద్యారంగ అభివృద్ధికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



పుస్తకాలు పట్టుకొని నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నూతన ప్రభుత్వం బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్ లో విద్యారంగం అభివృద్ధికి చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో విద్యారంగానికి అధిక బడ్జెట్ ను కేటాయించాలని పుస్తకాలతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. గత పాలకుల ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో నిర్వహించే బడ్జెట్ సమావేశాలలో కొఠారి కమిషన్ పేర్కొన్నట్టుగా రాష్ట్రాలలో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. అదేవిధంగా బడ్జెట్ సమావేశాలకు ముందుగానే విద్యారంగం అభివృద్ధి కోసం స్పష్టమైన నివేదికను ప్రభుత్వం తయారు చేయాలని సూచించారు. దానితోపాటుగా ఈ సమావేశాల ముందుగానే విద్యాశాఖ మంత్రి పోర్ట్ ఫోలియో ను నియమించాలని ఆయన అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌ను ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలని అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని అన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నెలకొల్పి ఉన్నవాటిలో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, మధ్యాహ్న కార్మికుల మిడ్ డే మీల్స్ బిల్లులను విద్యార్థులకు పోష్టిక ఆహారాన్ని అందించాలని అన్నారు. ఈ బడ్జెట్లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, నాయకులు సందీప్, గణేష్, సురేష్, బాబు రావ్ వరదరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

జిట్టపులి సంచారం

- రుద్రూర్ వరి పరిశోధన పరిసరాలలో అడవిపంది హతం

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)



పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామంలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం పరిసరాల్లో జిట్టపులి సంచరిస్తుంది. బుధవారం ఉదయం పరిశోధన పరిసరాల్లో అడవి పంది కళేబరం గమనించిన వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ ప్రదేశాన్ని అటవీశాఖ అధికారి చంద్ర ప్రకాష్, బాబులు సందర్శించారు. ఘటన స్థలంలో పాద ముద్రలను పరిశీలించిన అధికారులు అడవి పంది పై జిట్టపులి దాడి చేసి చంపేసిందని నిర్ధారించారు. ఆ ప్రదేశానికి ప్రజలు ఎవరు వెళ్లరాదని, తప్పని పరిస్థితిలో వెళ్ళవలసి వస్తే టపాకాయలు కాలుస్తూ పెద్ద శబ్దాలు చేస్తూ వెళ్లాలని సూచించారు. సగం పందిని తిన్న జిట్ట పులి మళ్లీ అడవిలోకి వెళ్ళిపోతుందని ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

ఇందిరమ్మ కాలనీ ల సందర్శన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలని, గాంధీనగర్‌లోను బుధవారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీ వాసులతో ముచ్చటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని, చేయాల్సిన పనులకు పరిష్కార మార్గాలను పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ కు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకట రవి, నాయకులు పాలెపు నరసయ్య, బుచ్చి మల్లయ్య, ఊట్నూరి ప్రదీప్, నల్ల గణేష్ గుప్తా, సింగిరెడ్డి శేఖర్, సాయికుమార్, తదితరులు ఉన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్ వెనక్కు రప్పించాలి

- 26న కార్యాలయం ఎదుట జెండా ఎగురవేయాలి : బీజేపీ డిమాండ్
- నవతెలంగాణలో కథనం నేపథ్యంలో కార్యాలయాన్ని శుభ్రం చేసిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ పాత తాలూకా కేంద్రంలో ఉండవలసిన ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం అక్రమంగా బిచ్కుందకు తరలించారని, వెంటనే మద్నూర్‌లోని కార్యాలయంలో కార్యకలాపాలు పున: ప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మద్నూర్ నుంచి తరలిపోయి కార్యాలయ బిల్డింగ్ పాతబడుతూ బిల్డింగును ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడం కుక్కలకు పందులకు ఇతర కార్యకలాపాలకు అడ్డగా మారడంతో 'బిచ్కుందలో ఆఫీసు.. మద్నూర్ స్టాంపులు' శీర్షికతో నవ తెలంగాణ దినపత్రికలో, నవతెలంగాణ వెబ్‌లో బుధవారం కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో బీజేపీ నాయకులు స్పందించారు. బుధవారం నాయకులు కార్యకర్తలు కలిసి తరలిపోయిన ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పాటుపడ్డ బిల్డింగును సందర్శించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కష్ణ పటేల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలయంలో అప్పటి జుక్కల్ శాసనసభ్యులుగా ఉన్న హనుమంతు షిండే ఇక్కడ ఉండవలసిన ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం బిచ్కుందకు తరలించారని, 26వ తేదీలోగా ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు వెనక్కు తీసుకురావాలని కోరారు. 26 జనవరి రోజున అధికారులు కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఎగరవేయాలని, లేకుంటే తాము ఎగురవేస్తామని స్పష్టం చేశారు. తరలిపోయిన కార్యాలయం వచ్చేదాకా శాంతియుత మార్గంలో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కష్ణ పటేల్, తుకారాం యాదవ్ రావు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వినతి

నవతెలంగాణ-ఆర్మూర్



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, కౌన్సిలర్‌లు

ఆర్మూర్ మున్సిపల్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి చైర్ పర్సన్‌ను తొలగించగా.. వెంటనే చైర్‌పర్సన్ ఎన్నికల చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్ అథారిటీ ముఖ్య కార్యదర్శి ఐఏఎస్ దానకిషోర్ కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఎన్నిక చేపట్టేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల రాము, లిక్కి శంకర్, ఇట్టెడి నర్సారెడ్డి, అయ్యప్ప శ్రీను, ఖాందేష్ శ్రీనివాస్ , సుంకరి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని

నవతెలంగాణ-మాచారెడ్డి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న ఏనుగు అశ్విత జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్ బుధవారం తెలిపారు. ఆసిఫాబాద్‌లో జరిగిన 67వ రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి మూడవ స్థానం సంపాదించినట్లు పేర్కొన్నారు. ఈ నెల తేదీ 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించనుందని అశోక్ తెలిపారు. అశ్విత ఎంపిక కావడం పట్ల ఎంపీటీసీ రావుల వినోద ప్రభాకర్, సర్పంచ్ అంబటి లలితా నారాయణ, ఎస్ఎంసి చైర్మన్ రామ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, గ్రామ యువత, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. అశ్వితకు ప్రోత్సాహకంగా ఎంపీటీసీ వినోద ప్రభాకర్, సర్పంచ్ లలితా నారాయణ, సత్యనారాయణలు ఆర్థిక సహాయం అందించారు.

ఆటో ఇస్మాయిల్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

గడ్కోల్ గ్రామంలో ఆటోడ్రైవర్ ఇస్మాయిల్ కుటుంబాన్ని నవయువ యూత్ సభ్యులు పరామర్శించి ఆ కుటుంబానికి ఎల్లవేళలా తోడు నీడగా ఉంటామని తెలిపారు. ఆకస్మికంగా గుండెపోటుతో ఇస్మాయిల్ మరణించడం కుటుంబానికి తీరనిలోటని నవ యువ యూత్ సభ్యులు అన్నారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 4,500 అందజేశారు కార్యక్రమంలో నవ యువ యూత్ అధ్యక్షులు సంద్ర శంకర్, రఘురాజ్, డాక్టర్ నరేష్, సంద్ర రంజిత్, ఎండి ఫారుక్, డాక్టర్ మోహన్, మెండి అశోక్, తలారి హేమంత్, శ్రీనివాస్ కొమ్మేటి పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


కుటుంబాన్ని పరామరించిన యూత్ సభ్యులు

వికలాంగులకు స్కూటీలు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్‌పార్టీ ఆఫీసులో మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ అన్ని మండలాల సంబంధించిన వికలాంగులకు స్కూటీలు ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి చేతుల మీదుగా వృద్ధులకు బుధవారం అందజేశారు. మండలంలోని లక్ష్మాపూర్, అర్గుల్ గ్రామాలకు చెందిన ఇద్దరు వికలాంగులకు నడకుడ సుప్రియ, అర్గుల్ రజినికి స్కూటీలను అందించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సర్పంచ్ గోర్త పద్మ, జక్రన్ పల్లి మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాష్, మునిపల్లి సర్పంచ్ చిన్న సాయి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


వికలాంగులకు స్కూటీలు అందజేసిన ఎమ్మెల్యే

26 నుంచి రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డీ. అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్లో డబుల్ ఓపెన్, 40 ప్లస్ వయస్సు కేటగిరిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్ ఎంట్రీ ఫీజు రూ.600 ఉంటుందని, క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారు తిరుపతి(9440295523), పవన్ (9912179291) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకంతోపాటు ట్రోఫీలు బహుకరించనున్నట్లు తెలిపారు.

27న ఉచిత యాంటి రేబిస్ టీకాలు

నవతెలంగాణ-సిరికొండ

ఈ నెల 27న మండలకేంద్రంలోని అన్ని గ్రామాల్లోని పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వనున్నట్లు మండల పశు వైద్యాధికారి బాబురావు బుధవారం తెలిపారు మండలంలోని పెంపుడు జంతువుల యజమానులు ఈ వ్యాక్సిన్ ని సద్వినియోగ పరుచుకోవాలని, పెంపుడు కుక్కలకు ఇతర వ్యాధి సోకినా వాటిని తాకిన వ్యాది సోకకుండా యింటి రేబిస్ టీకాలు అందిస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీలో డ్రైవర్స్ డే

- అత్యుత్తమ డ్రైవర్లకు సన్మానం


డ్రైవర్‌ను సన్మానిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం నిజామాబాద్ రీజియన్‌లోని అన్ని డిపో పరిధిలో విధుల్లో ఉన్న డ్రైవర్లను ఆహ్వానించి పుష్పాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు, డిపో వారిగా డ్రైవర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. నిజమాబాద్ డిపో-1 లో ముఖ్య అతిథిగా నగర ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్ పాల్గొని ఆర్టీసి డ్రైవర్లు క్రమశిక్షణకు మారుపేరని, వారు యాక్సిడెంట్లు జరగకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు పాటించాలి అనే విషయాన్ని వివరించారు. ఎంపిక చేసిన ముగ్గురు అత్యుత్తమ డ్రైవర్లను శాలువా, మెమోంటోతో సత్కరించారు. నిజామాబాద్ డిపో-2 లో ముఖ్య అతిథిగా ఎం. కిరణ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పాల్గొని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో బి.యస్. ఆనంద్, డిపో మేనేజర్, నిజామాబాదు డిపో-1, ఎస్. సాయన్న డిపో మేనేజర్, నిజామాబాదు డిపో-2, ఆయా సూపర్ వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం రక్తహీనత ముక్త్ భారత్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ ప్రారంభించారు. నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల యొక్క రక్త నమూనాలను సేకరించనున్నారు. రక్తహీనత ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి వారి హెచ్బి పర్సంటేజ్ ని నిర్ధారించడం జరుగుతుందనీ అన్నారు. రక్తహీనత ఉన్నట్టయితే వారికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉమ్మడి బాల్కొండ మండలంలోని 8వ తరగతి నుంచి కాలేజీ స్థాయి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో సుమారు 600 పైగా విద్యార్థులకు సుమారు ఆరు రోజులపాటు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి బాల్కొండ మండలంలో సుమారు 6000 పైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శంకర్ ,మెడికల్ ఆఫీసర్ సూర్యనారాయణ జాదవ్, ఆర్ బి ఎస్ కే ఏఎన్ఎం స్వరూప రాణి, వైద్య ఆరోగ్యశాఖ ఎంపీహెచ్డబ్ల్యు రాజు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పురాణి పేట్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు బొడ్డు భరద్వాజ తమ సొంత ఖర్చులతో విద్యార్థు లకు టై, బెల్ట్, బ్యాడ్జిలు ఐడి కార్డులు బహుకరించారు. వీటిని మండల విద్యాధికారి స్వామి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సర్పంచ్ తోట శంకర్, విద్యా కమిటీ చైర్మన్ రవీంద్ర వర్మ, వైస్ చైర్మన్ స్వామి, పిఆర్‌టియు మండల అధ్యక్షుడు వాసుదేవ్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


టై, బెల్టులు అందజేస్తున్న ఉపాధ్యాయుడు

ఆస్ట్రోమెడ్ డయాగ్నస్టిక్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని తిరుమల థియేటర్ రోడ్డులో ఆస్ట్రోమెడ్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ప్రజలకు వైద్యం మరింత చేరువగా వైద్యుల్ని అందిస్తున్నారని, దానికి తోడుగా నూతనంగా ఏర్పడిన ల్యాబ్ ఇంటి వద్దకే వచ్చి శాంపుల్ కలెక్ట్ చేసుకోవడం జరుగుతుందని అన్నారు. అటువంటి సౌకర్యాన్ని కూడా ఈ ల్యాబ్ వారు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ యజమాని డాక్టర్ విక్రమ్ రెడ్డి, శ్వేతా రెడ్డి తదితర డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు

- ఓటు ప్రాథమిక హక్కు
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

దశాబ్దాలుగా ఆవహించిన నిర్లిప్తను పారదోలి పౌరులంతా కలిసి తమకు సేవ చేసే పాలకులను ప్రత్యక్షంగా ఎన్నుకునేందుకు రాజ్యాంగం అందించిన వజ్రాయుధం ఓటు హక్కు. దీన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం కల్పిస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పాలకులను శాసించే అధికారాన్ని మనకు కట్టబెట్టిన ఓటు హక్కుపై ప్రజలను చైతన్య పరచడానికి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు ఈ నేపథ్యంలో నవ తెలంగాణ కథనం....

18 సంవత్సరాలు నిండిన...

18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఓటు హక్కు. నేటి రాజకీయ వ్యవస్థలో మార్పులు యువతతోనే సాధ్యం అనే భావన ప్రతి ఒక్కరిలో ఉంది. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి దేశంలో పార్లమెంటు ఎన్నికలు 15 సార్లు శాసనసభ ఎన్నికలు 17 సార్లు జరిగాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలతో వచ్చే ఏప్రిల్‌లో ఎంపీ,, ఆ తర్వాత సర్పంచుల ఎన్నికలు జరిగేందుకు ఎన్నికల అధికారులు సమాయత్తం అవుతున్నారు.

1959... జనవరి 25న ఏర్పాటు...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం పౌరులకు సార్వత్రిక ఓటు హక్కు కల్పించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు లోక్‌సభ, ఆ రాష్ట్ర శాసనసభ స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 25న ఓటు హక్కును కల్పించింది. అయితే 2011 జనవరి 25 నాటికి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అప్పటినుంచి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి..

18 ఏళ్ల నిండిన యువత జన్మదిన ధ్రువీకరణ పత్రం లేదా పదవ తరగతి మెమో, రెండు ఫొటోలతో ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. ఓటు హక్కు నమోదు నిర్దేశించిన పారం ఆరును జత చేసి అందులో దరఖాస్తుదారు వివరాలు నింపాలి. ఓటరు జాబితాలో పేరు తొలగించేందుకు అప్లికేషన్ ఫారం సమర్పించాలి. ఓటరు జాబితాలో నమోదైన వివరాలు సరిదిద్దుకునేందుకు ఫారం-8 ఓటర్ జాబితాలో ఉన్న ఓటును మరో పోలింగ్ కేంద్రానికి బదిలీ చేయడానికి 8-ఏ సమర్పించాలి.

ఓటు వేసేది ఎలా..

పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఏర్పాటు చేస్తారు అందులో పొందుపరిచిన జాబితాలోని అభ్యర్థి ఎదురుగా ఉన్న నీలం రంగు బటన్ నొక్కడం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఒకరికి ఒకసారి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది.. ఓటు వేయగా నీలం రంగు ఎరుపు రంగులోకి మారుతుంది.. ఒకవేళ మీ ఓటును వేరే వారు ఎవరైనా వినియోగించుకున్నట్లు గుర్తిస్తే చాలెంజింగ్ ఓటు కోసం ఎన్నికల సిబ్బందిని సంప్రదించవచ్చు. ఒక పోలింగ్ కేంద్రంలో చాలెంజింగ్ ఓటర్ల సంఖ్యను బట్టి జరిగినట్టు భావిస్తే ఈసీ అక్కడ మరోమారు ఎన్నికలు జరిపే వీలుంటుంది..

ఓటర్ కార్డు... పోస్టల్ ఓటింగ్.. నేడు ఈవీఎంల వినియోగం...

1995 లో నాటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టిఎన్ శేషన్ ఓటరు నమోదు పారదర్శకంగా ఉండడంతో పాటు దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశ పెడతామని తీసుకున్న నిర్ణయం అప్పట్లో సంచలనం కలిగించింది.

గత ఎన్నికలలో సిబ్బంది మాత్రమే పోస్టల్ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉండేది.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అచేతన స్థితిలో ఉండి ఓటు హక్కు వినియోగించుకునే వారికి, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఫామ్ 12 డి ద్వారా అవకాశం కల్పించారు. మరో 13 రకాలకు చెందిన ఉద్యోగులు పాత్రికేయులకు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం ఇచ్చారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) పుట్టి గత సంవత్సరం నాటికి 41 సంవత్సరాలు అవుతోంది. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా ఈ యంత్రాలను ప్రవేశపెట్టింది. కేంద్ర ఎన్నికల కమిషన్ మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్రం --పరువు--- అసెంబ్లీ నియోజకవర్గంలో 19 మే 1982 లో ఈవీఎంలను వినియోగించారు. ఆ తర్వాత 1982 ..83 లో జరిగిన ఉప ఎన్నికలలో దేశవ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో వీటిని వాడారు. 1999, 2004 శాసనసభ ఎన్నికల్లోను లోక్‌సభకు, 2004, 14 మధ్య జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు ఈవీఎంలను వినియోగించారు.

నిర్లిప్తత వీడితేనే...

అందరికీ ఓటు హక్కు కావాలంటారు. వినియోగించుకోవడం బాధ్యతగా భావించారు. అందుకే ఎన్నికల్లో పోలింగ్ శాతం ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదు. ఆ.. మనం వెయ్యకపోతే ఎన్నికలు ఆగిపోతాయా..? నేను ఓటేస్తే గెలుస్తారా?... అంటూ సెలవును వ్యక్తిగత పనుల కోసం వినియోగించుకుంటారు. ముఖ్యంగా విద్యావంతులు ఉండే పట్టణ నగరాల్లోనే ఇలాంటి నిర్లిప్తత కనిపిస్తోంది. ఇక ముందైనా పోలింగ్ కేంద్రానికి వెళ్లి అమూల్యమైన ఓటు వేసి ప్రజాస్వామ్యంలో భాగస్వాములవ్వడానికి సంసిద్ధం కావలసిన తరుణం ముందు ఉంది.

ఉమ్మడి జిల్లాలోని...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ అర్బన్, రూరల్ బాల్కొండ ,ఎల్లారెడ్డి, జుక్కల్ కామారెడ్డి మొత్తం 9 నియోజకవర్గాలు ఉండగా వీటిలో మహిళ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. గెలుపోటములను శాసించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాలకు మొత్తం20,26,974 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

నియోజకవర్గాల వారీగా గత ఎన్నికలలో నమోదైన ఓటింగ్ శాతం..

2014, 2018 ఎన్నికలలో ఆర్మూర్లో 74.37,...7908, బోధన్ 76.03, 81.34లో, జుక్కల్‌లో 76.97, 85.56, బాన్సువాడ లో 77.37, 84.10, ఎల్లారెడ్డిలో 79.46, 86.32, కామారెడ్డిలో 72.14, 78.83, నిజామాబాద్ అర్బన్‌లో 52.59, 62.65, గ్రామీణ యందు72.72, 79.15, బాల్కొండలో 74.25, 79.70 శాతం నమోదయ్యాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో నియోజకవర్గంలో 65శాతం పోలింగ్ జరగక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు బీఆర్ఎస్‌కు 342, కాంగ్రెస్‌కు 635, బిజెపికి 1003 నమోదయ్యాయి.

నేడు ఓటరు చైతన్య ర్యాలీ..



రాజ్యాంగం మనకు కల్పించిన అతి విలువైన ఆయుధం ఓటు. ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. నేడు పట్టణ తహసిల్దార్ కార్యాలయం యందు సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమంతో పాటు అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ చైతన్య ఓటరు ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి.

శ్రీకాంత్, తహసిల్దార్, ఆర్మూర్..

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న..



ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా జీవితంలో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న. అసెంబ్లీ ఎన్నికలలో తొలి ఓటును వినియోగించుకోవడం నా బాధ్యతగా భావించా.

ఎస్.వెంకటేష్, విద్యార్థి, మామిడిపల్లి

ఇంజనీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాల ఉన్నతీకరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు)నాయకులు డిమాండ్ చేశారు.

బుధవారం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు నగర అధ్యక్షులు ఎస్.కె. అషర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఇంజనీరింగ్ చదవడానికి ఆసక్తిగా ఉన్న ఆర్థిక ఇబ్బందుల ద్వారా చదవలేకపోతున్నారన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజల, విద్యార్థుల ఆకాంక్ష మేరకు ఇంజనీరింగ్ కాలేజీగా పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే పిడిఎస్‌యు ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టామని, తద్వారా గత ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పిందని తెలిపారు. నిజామబాద్ జిల్లాలో ఉన్న గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అప్‌గ్రేడ్ కాలేదని అన్నారు. చాలా మంది విద్యార్థులు ఇంజనీరింగ్ ఉన్నత చదువులకు దూరమయ్యారని, ముఖ్యంగా విద్యార్థినీలు చదవాలని ఆసక్తిగా ఉన్నా దూరప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారన్నారు. రూరల్ ప్రాంత విద్యార్థులు ఇంజనీరింగ్ చదవాలని ఆసక్తి ఉన్న వాళ్ళ ఆర్థిక భారంతో చదవలేక పోతున్నారన్నారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వెంటనే చొరవ తీసుకొని నిజామాబాద్ నగరంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఆ దిశగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు చొరవ తీసుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో నగర కోశాధికారి తిరుమలేష్, నగర నాయకులు సలీం, సృజన్, విజయ్,సమీర్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ


షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నగరంలోని పలువురికి షాదీ ముబారక్ చెక్కుల అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు. బుధవారం భోధన్ రోడ్ లీమ్రు గార్డెన్‌లో ఏర్పాటు చేసిన షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షాదీ ముబారక్ పథకం పెళ్లి చేసిన ఆడబిడ్డ కుటుంబానికి భారం కాకుండా ఆర్థిక సహాయం కింద లక్ష నూటపదహారు రూపాయల విలువ గల చెక్కులను నగరంలో నూటయాభై ఎనిమిది మంది లబ్దిదారులకు అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ అనే లక్ష్యం తో పని చేస్తుందని, ఇందూర్ అర్బన్‌లో మైనారిటీల అభివృద్ధి,

సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ , ఇద్రాస్ ఖాన్ మరియు బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కార్పొరేటర్స్ మాస్టర్ శంకర్,వెల్డింగ్ నారాయణ, బైక న్ మధు, బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఖైజార్ చౌష్,నార్త్, సౌత్ మండలం ఎమ్మార్వో లు, ఆర్ఐలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వై.ఓమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తామని అన్నారు. ప్రధానంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్ల కింద మార్చడంతో పాటు రైతుకు మరణ శాసనం లాంటి మూడు చట్టాలను తీసుకురావడంతో పాటు ఈ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రధానంగా ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వే, డిఫెన్స్, బిఎస్ఎన్ఎల్‌లతోపాటు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. అంబానీ, ఆదానీలకు ఈ దేశ సంపదను దోచిపెట్టడాన్ని నిరసిస్తూ ఒకరోజు సమ్మెను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమ్మెలో జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి యూనియన్ నాయకత్వం ఈ నెల 30, 31 తేదీల్లో తమ యాజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు నాయకులు హనుమాన్లు, దేవేందర్, అనిల్, జీవి చారి, భాగ్యలక్ష్మి ,కవిత, సంపత్ ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐటియుసి నాయకులు

27న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి స్వామి తెలిపారు. జంతు సంరక్షణ, పౌరుల బాధ్యత పై నిర్వహించే ఈ పోటీలకు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు ఒక్కో పాఠశాల నుండి ఇద్దరు పాల్గొనేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ తెలియజేశారు.

బీసీల హక్కుల కోసం పోరాటం చేద్దాం

- బీసీ సంఘాల ఐక్యవేదిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బీసీలు ఐక్యంగా ఉండి, బీసీల హక్కుల కోసం పోరాటం చేద్దామని బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బొబ్బిలి నర్సయ్య అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుభాష్ నగర్‌లోని ప్రైవేట్ విద్యా సంస్థలో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సెక్రెటరీగా కస్తూరి కృష్ణ, నగర వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్. భాస్కర్, మహిళల విభాగంలో మహిళ విభాగం జిల్లా సెక్రె టరీగా ఎస్.లావణ్య, ఈసీ లుగా రాజ సులోచన, సుమల తలకు జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, ఉద్యోగుల విభాగం రాష్ట్ర నాయకులు రేవంత్, రాష్ట్ర కార్యదర్శి సుజిత్ ఠాకూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.మురళి, జిల్లా ఉపాధ్యక్షులు శ్యాం, జిల్లా మహిళ అధ్యక్షురాలు ఏం. స్వప్నకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంఘం జిల్లా జెఎసి అధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య హాజరై ఆయన మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండి, బీసీల హక్కుల కోసం పోరాటం చేద్దామని, రానున్న రోజుల్లో బీసీల రాజ్యాధికార పోరాటానికి సిద్ధంగా ఉందామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి యం.శివ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బురుగుల వినోద్, జిల్లా విద్యా విభాగం కార్యదర్శి చైతన్య కృష్ణ, అమంద్ ప్రవీణ్ కుమార్, స్వామి యాదవ్, అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేత

సెక్రెటరీ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేసుకుంటున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం

మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సెక్రెటరీ ఫెడరేషన్ (టిపియస్ఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టినట్లు మండల పంచాయతీ సెక్రటరీల సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు తీసుకోవడం మూలాన తమ భవిష్యత్తు కార్యచరణకు ధీమా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకుగాను ప్రతి ఒక్క పంచాయతీ సెక్రెటరీ తమ విధిగా భావించి సభ్యత్వానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ సఫ్దర్ ఆలీ మాట్లాడుతూ.. సైబర్, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, దానిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి పడితే వారికి ఓటీపీలు చెప్పవద్దని, అలాగే చరవాణిలోకి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితులలో ఓపెన్ చేయకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ సాయిలు, బాలరాజ్, హరిబాబ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలికలకు భవిష్యత్

- పలువురు ప్రజాప్రతినిధులు
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



బోధన్: గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందజేత



రెంజల్: మాట్లాడుతున్న ఎంపీపీ



నాగిరెడ్డిపేట్: విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్: విద్యతోనే బాలికలకు భవిష్యత్తు ఉందని, కావున విద్యను నిర్లక్ష్యం చేయవద్దని బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి అన్నారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదవడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. భవిష్యత్తులో మీ కాళ్ళపై మీరు నిలవడానికి సమాజానికి దిశానిర్దేశం చేయడానికి విద్య ఒక్కటే మార్గం అన్నారు. నేటి కాలంలో ఆడపిల్లలపై నిరాదరణ లేకుండా ప్రతి ఒక్కరూ మహిళలను చైతన్యం చేయాలన్నారు. బాల్యవివాహాలు, భ్రూణహత్యలు లేకుండా, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా సమాజంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీడీపీఓ జానకి మాట్లాడుతూ.. సమాజంలో బాలికల ప్రాముఖ్యత ఎంతో అవసరమని తెలిపారు. బాలికల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుకుంటేనే ఏదైనా సాధ్యమని కావున దానిని నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. విద్యావంతులయిన మహిళలు నేడు ఎంతో మంది గొప్ప గొప్ప స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఐసిడిఎస్ ద్వారా బాలిక సంరక్షణకు, బాలికల ఆరోగ్యవంతం కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పలు పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, అలివేణి, సర్పంచ్ భుయన్ చంద్రకళ, సూపర్వైజర్లు గంగవేణి, గోపి లక్ష్మి, సౌజన్య, సౌమ్య, బోధన్ పట్టణంలో సూపర్వైజర్ రాధిక పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలికల హక్కుల గురించి సూపర్‌వైజర్ రాధిక వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం, రక్తహీనత గురించి ప్రతిరోజు ఆకుకూరలు తాజా పండ్లు, పాలు, రాగి జావ లాంటివి పిల్లలు తీసుకోవాలని వివరించారు. అలాగే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ విక్టోరియా రాణి, రత్న, సరోజ, అర్చన, లక్ష్మి, అనిస్ ఫాతిమా, బ్రదరున్నిస, రుక్సానా పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాలలో రాణించాలి..

రెంజల్: నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాలలో రాణించాలని, బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ రజినీ కిషోర్ పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారని, అలాగే వారి హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. భేటీ బచావో, బేటి పడావో అనే నినాదాలు గ్రామంలో అంగన్వాడీ టీచర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఎమ్మెస్ రమేష్‌కుమార్, ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, గ్రామ కార్యదర్శి రాఘవేందర్‌రావు, అంగన్వాడీ టీచర్లు సురేఖ, సుజాత, రాజ్యలక్ష్మి, పద్మ, రజిత, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, కిషోర్‌కుమార్, గంగాధర్, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి..

లింగంపేట్: బాలికలు పురుషులతో పోటీపడి అన్ని రంగాల్లో ముందుండాలని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతి అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు డాన్స్, స్పీచ్ చదువులపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు పట్టుదలతో అన్ని రంగాల్లో ముందుకు నడవాలని ఆమె సూచించారు. చదువు, క్రీడలు, వైద్యం పోటీ తత్వంతో ముందుకు సాగాలన్నారు. బాలికలు ఎంచుకున్న మార్గాన్ని లక్ష్యంతో ముందుకువెళ్తే సాధ్యమవుతుందన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చునని సూచించారు. బాల్యం బంగారు భవిష్యత్తునిస్తుందని ఆమె పేర్కొన్నారు. కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలకు చెందిన రాష్ట్రస్థాయి యోగ పోటీలో సోనా 9వ తరగతి విద్యార్థి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో మీనాక్షి 9వ తరగతి విద్యార్థులు ఎంపికవడంతో వారిని శాలువా కప్పి అభినందించారు. ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని నృత్యాలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని వదలపర్తి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీ పనులను బుధవారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ లో పెంచే మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలు సుకున్నారు. ప్రతి నర్సరీలో పదివేల మొక్కలు పెంచే విధంగా ప్రాణాళిక నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళ సంఘాల బ్యాంకు లింకేజీ లక్ష్యం పూర్తి చేయాలి

నవతెలంగాణ-బోధన్

2023-24 సంవత్సరా నికి గాను మహిళా సంఘాల కు బ్యాంకు లింకేజీ లక్ష్యం పూర్తి చేయాలని ఐకేపీ ఏపీఎం వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం బోధన్ మహిళ సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 577 సంఘాలకు రూ.3064.35 లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. ఇప్పటి వరకు సాధించిన ప్రగతి 496 సంఘాలకు 2960.95 లక్షలు రూపాయలు అందించినట్లు తెలిపారు. అలాగే న్యూఎంటర్ ప్రైజెస్‌లో భాగంగా 320 వ్యాపారాలు ఏర్పాటు చేయడానికి సంఘం సభ్యులను గుర్తించినట్టు తెలిపారు. గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు అన్నీ ఏ, బీ గ్రేడ్‌లో ఉండాలని మహిళ సంఘాలకు సూచించారు. బ్యాంక్ లింకేజి పూర్తి కావాలని, గ్రామ సంఘాల బకాయిలు 100శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి సభ్యురాలికి ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పద్మావతి, ఖైరున్నీసా, సీసీలు, ఎం.ఎస్ ఆపరేటర్, అకౌంటెంట్ పాల్గొన్నారు.

తాడ్‌బిలోలి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఘనంగా సన్మానించినట్టు గ్రామ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈనెల 31న గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు పదవీ పూర్తి కానుండడంతో సభ్యులందరికీ ఘనంగా సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ వెలుమల సునీత నరసయ్య, ఉప సర్పంచ్ లక్ష్మి, ఎంపిటీసీ చింతకుంట లక్ష్మి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాటల పోటీలు



పోస్టర్ ప్రెసెంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థినిలు

నవతెలంగాణ-బిచ్కుంద

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమం, జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పాటల పోటీలు, పోస్టర్ ప్రెసెంటేషన్ పోటీలు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ నుంచి వ్యాసరచన, ఉపన్యాసం, పాటలు, గోడపత్రిక, రంగోలి పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్వో, ఎస్ఐకి బీఎస్పీ ఆధ్వర్యంలో సన్మానం



సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-మాచారెడ్డి

పాల్వంచ మండలంలో నూతనంగా ఏర్పడిన బీఎస్పీ మండల కమిటీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని పాల్వంచ ఎమ్మార్వో జయంత్‌రెడ్డి, మాచారెడ్డి ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బట్టంకి బాలరాజు, అసెంబ్లీ ఇన్చార్జి తమ్మడి స్వామి, మండల అధ్యక్షులు శంకర్ బాబు, మండల ఉపాధ్యక్షులు దేవోళ్ళ శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మణ్, బి.రవీందర్, రాకేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించి చిన్నారుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తల్లి గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. తమ ఇంటిలో ఎలాంటి రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు కాయగూరలు పండించుకోవాలన్నారు. చిన్నారుల బరువు కొలిచిన తర్వాత వారికి ప్రత్యేకమైన పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సురేఖ, గర్భిణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీపై పోచారం విమర్శలు చేయడం సిగ్గుచేటు

- జిల్లా నాయకులు మనోహర్



మాట్లాడుతున్న నాయకులు మనోహర్

నవతెలంగాణ-కోటగిరి

అధికారంలోకి వచ్చి 40 రోజులు కాకముందే ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ పార్టీ స్కీములు 420 స్కీములని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడడం సరికాదని, తమ పార్టీపై విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా డెలిగేట్ కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్, సీనియర్ నాయకులు గంగాధర దేశాయ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాహిద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాన్సువాడ సమీపంలోని సోమేశ్వర క్రషర్‌లో 40 లక్షల విద్యుత్ బకాయి పోచారం తనయుడు పోచారం సురేందర్‌రెడ్డి గతంలో అధికారులను అడ్డం పెట్టుకొని బకాయి చెల్లించలేదని, దీనిని బట్టి 420 ఎవరో అర్థమవుతుందని తెలిపారు. మరిన్ని అవకతవకలు కాంగ్రెస్ పార్టీ బయటకు తీసి పోచారం తనయుల బాగోతం బయటపెడతామన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాలలో

దరఖాస్తులు చేసుకోవాలి

- డిఎల్‌పిఓ సురేష్
- కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాల, లింగంపల్లి గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎల్లారెడ్డి డిఎల్‌పిఓ సురేష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ జూనియర్ కళాశాల గురుకుల పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న కార్యదర్శులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మైనార్టీ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు. మైనార్టీ జూనియర్ కళాశాలలో బైపీసీ 40 సీట్లు, ఎంపీసీ 40సీట్లు మొదటి సంవత్సరంలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందులో 20 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించినట్టు తెలిపారు. లింగంపల్లి గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5,6, 7,8 తరగతులలో 40 సీట్లు ఖాళీలున్నాయని, ఇందులో 30 సీట్లు మైనార్టీలకు కేటాయించినట్టు వివరించారు. 10 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించినట్టు పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలు ఫిబ్రవరి ఆరో తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సంబంధిత ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుకు కార్యదర్శులు తమవంతు బాధ్యతగా ప్రవేశాల కోసం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సుధాకర్, మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కిషన్, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ రాములు, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఆర్ఐ బాలయ్య, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రతీ విద్యార్థి సేవా దృక్పథంతో ముందుకు రావాలి

- సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిఐ దొడ్లే మోహన్‌రావు

నవతెలంగాణ-రాజంపేట్

ప్రతి ఒక్క విద్యార్థి సేవా దృక్పథంతో ముందుకు రావాలని సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిఐ దొడ్లే మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఆరేపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అగ్నిమాపక దళం డెమోక్లాసుల నిర్వహణ, సీసీ కెమెరాల ఇనాగ్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ఫైర్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిమాపక దళం గురించి విద్యార్థులకు ప్రాక్టికల్స్ క్లాసులు నిర్వహించారు. విద్యార్థులకు అగ్నిమాపక దళం గురించి వివరిస్తూ విద్యార్థులు పాఠశాల దశ నుంచి ఉన్నత చదువుల కోసం ఆలోచన చేయాలని, ప్రతి ఒక్కరూ సేవాతృక్పథంతో ముందుకు రావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను మంచి స్థాయికి తీసుకురావాలని, పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ పాఠశాల సిబ్బందిని, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంకం శ్యాంరావును అభినందిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా వారు ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు సీసీ కెమెరాలను డొనేట్ చేసి.. సీసీ కెమెరాలను వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ ఫైర్ సిఐ దొడ్లే మోహన్ రావును ఎస్ఎంసి చైర్మన్ అంకం శ్యామ్‌రావు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం గంగమోహన్, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ సిఐ దొడ్లే మోహన్ రావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంకం శ్యామ్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కామారెడ్డి ఫైర్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బహుజన కులాలు ఏకం కావాలి

- బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్.సిద్దిరాములు



జెండాను ఆవిష్కరిస్తున్న బిఎల్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బహుజన రాజ్యం రావాలంటే బహుజన కులాలు ఏకం కావాలని బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్, సిద్దిరాములు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) 6వ ఆవిర్భావం సందర్భంగా జిల్లా కార్యాలయం వద్ద జెండాను బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యస్.సిద్దిరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఎల్ఎఫ్ ఏర్పడి 6 సంవత్సరాలు పూర్తయ్యిందని తెలిపారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే నూటికి 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఆధిపత్య కులాల పేదలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బిసి కులగణన తక్షణమే జరపాలని అన్నారు. కార్యక్రమంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యం. ఆంజనేయులు, వడ్ల సాయికృష్ణ, క్రైవార్ నగేష్, గంగామణి, స్వప్న, బాలకిషన్, శ్యామల, శాంతమ్మ, గంగాధర్, గురుమూర్తి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

- స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి యువత తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణ మహిళా సమాఖ్య సభ్యులకు, దేవునిపల్లి, లింగాపూర్, రాజంపేట్, రామేశ్వరపల్లి తదితర పలు ప్రాంతాలలోని మహిళా గ్రూపు సభ్యులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన యువత ఏడాదిలో నాలుగు సార్లు ఓటరుగా నమోదు చేసుకొనేందుకు భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం మనకు ఓటు హక్కు కల్పించిందని, ఓటరుగా నమోదు చేసుకున్న యువ ఓటర్లు రాబోయే పార్లమెంట్ ఎన్నికలల్లో తమ ఓటు హక్కు వినియోగిచుకొని తొలి అనుభూతి పొందాలని అన్నారు.

కార్యక్రమాలలో టిఎంసి అధ్యక్షురాలు సంతోషి, సభ్యులు సునీత, వాణి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు

- బహుమతులు అందజేత



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్‌కుమార్, ఎంపీపీ రజిని కిషోర్, ఎంపీడీవో శంకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ గౌసుద్దీన్, గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
గురువారం జనవరి 25, 2024 www.navatelangana.com

నేడు కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 25న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్స్‌తో సమావేశం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమ ఏర్పాట్లపై వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తో పీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారని తెలిపారు. 25న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం ఉంటుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ లెవెల్ ఏజెంట్స్ క్రియాశీలకంగా పనిచేశారని, రాష్ట్రంలో పార్టీని గెలిపించడంలో కీలక భూమిక పోషించారని, ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలకు అనుసరించాల్సిన విధానాలపై ఖర్గే దిశానిర్దేశం చేయనున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పలు సూచనలు చేయనున్నారని తెలిపారు.

చింరాజ్‌పల్లిలో పశువైద్యశిబిరం

నవతెలంగాణ-నందిపేట్


గర్భకోశ చికిత్స చేస్తున్న వైద్యులు

మండలంలోని చింరాజ్ పల్లి గ్రామంలో బుధవారం మండల పశు వైద్య అధికారుల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. పశువులకు గర్భ కోశ వైద్య చికిత్సలు చేశారు. జిల్లా పశువైద్యాధికారి జగన్నాథ చారి రైతులకు పాడి పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో (47)పశువులలో గర్భ కోశ వ్యాధుల చికిత్స, సాధారణ చికిత్స, (24), 38 దూడలకు నట్టల నివారణ మందులు తాగించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ మాజీద్ , గ్రామ సర్పంచ్ గణేష్ , ఎంపీటీసీ శ్రీనివాస్, పాల కేంద్రం అధ్యక్షుడు గాంధీ, పశువైద్య సిబ్బంది సరళారాణి, విజయ, స్వప్న, సత్యం, శ్యామల, విజయలక్ష్మి, రాజేందర్, గోపాలమిత్రులు రాజేశ్వర్, రఫీ, శశి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత కమ్మర్‌పల్లి


ట్రోఫీని అందుకుంటున్న టీం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఉన్న బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో గత కొద్ది రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కమ్మర్ పల్లి జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కమ్మర్‌పల్లి, పల్లికొండ జట్లు హెూరాహెూరీగా తలపడగా కమ్మర్ పల్లి జట్టు విజేతగా నిలవగా రన్నర్‌గా పల్లికొండ జట్టు నిలిచింది. విజేత జట్లకు బహుమతులను సర్పంచ్ అశోక్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి తోపారం గంగాధర్, బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బందెల రాజు, ఎన్నారై కత్తర్ గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు పాష, కమ్మర్ పల్లి ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, భూమేష్, బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రంజిత్, నితిన్, వినయ్, శ్రీను, రాజేశ్, గణేష్, విశాల్, వినోద్, తేజ, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం


దాతలను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

నవతెలంగాణ సిరికొండ

అయోధ్య లోని రామ మందిరం, బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సిరికొండలో దాతల ద్వారా నగదు, వస్తురూపంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా అయోధ్య రామ మందిరం క్షేత్ర తీర్థ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ అంగడి బజార్ మార్కెట్‌లో గ్రామ ప్రజలు అందరి సహకారంతో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ ను ఎల్ఈడి ప్రత్యక్ష ప్రసారం, డీజే తో పల్లకి సేవ ఊరేగింపు, అన్నదాన కార్యక్రమానికి దాతల ద్వారా (3,18,129) ఆదాయం రాగా(1,43,915) ఖర్చయినట్లు తెలిపారు. మిగిలిన 1,75వేలు గ్రామ ప్రజల సమక్షంలో సిరికొండ గ్రామంలోని శ్రీ శేష సాయి లక్ష్మీనారాయణ స్వామి మందిరం అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పెద్ద మొత్తంలో విరాళాలు అందజేసిన బిట్టు మొబైల్ షాప్ హేమంత్ 20వేలు, దుప్పారి సంజీవరెడ్డి 10వేల500, గ్యామ శోభన్ 10 వేల ఒక వంద వీరిని సిరికొండ అయోధ్య ట్రస్ట్ కమిటీ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నారాయణ విద్యార్థిని

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


విద్యార్థిని తల్లిదండ్రులకు సన్మానం

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో నిజామాబాద్ నగరానికి చెందిన నారాయణ పాఠశాల విద్యార్థిని శ్రీనిధి రికార్డు పొందిందని నారాయణ పాఠశాల ఏజీఎం శివాజీ తెలిపారు. బుధవారం స్కూల్‌లో విద్యార్థినితో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుభాశ్‌నగర్‌లోని నారాయణ పాఠశాలకు చెందిన శ్రీనిధి పిపి 1 విద్యార్థిని, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అర్హత సాధించింది. చిన్నారి ప్రయత్నాలను నైపుణ్యాలను సాహసాన్ని గుర్తించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసిందని, అందుకు తమ పాఠశాల తరఫున అభినందిస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల విద్యార్థిని చిన్న వయసులోనే 28 భారతీయ రాష్ట్రాల రాజధానులు పేర్లు అడగగానే చెబుతుందని, అలాగే 9 జాతీయ చిహ్నాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, గాయత్రి మంత్రం, గణితంలో రెండో ఎక్కాలను చదవడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డు కూడా సాధించిందని తెలిపారు. విద్యార్థిని శ్రీ నిధితో పాటు,తల్లిదండ్రులు వెంకటేష్ సుష్మ రాణి, లను నారాయణ పాఠశాల తెలంగాణ జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం శివాజీ పాటిల్, ప్రిన్సిపల్ జోష్న ఉపాధ్యాయ బృందం అభినందించి సన్మానించారు.

పల్లెదవాఖానా ప్రారంభం

నవతెలంగాణ-భీమ్‌గల్ రూరల్


పల్లెదవాఖాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని జాగీర్యాల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మానస శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంత్. ఎంపీటీసీ సుమలత రాజేశ్వర్, వార్డు సభ్యులు. వీడీసీ సభ్యులు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు డాక్టర్ రమేష్, డాక్టర్ అజయ్, ఏఎన్ఎంలు, ఆరోగ్యశ్రీ కార్యకర్తలు, ఫార్మసిస్టులు, జడ్పిటీసీ, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సర్వసమాజ్ కమిటీ అధ్యక్షునిగా శెవ్వ అశోక్

నవతెలంగాణ- భీంగల్


ఎన్నికైన సర్వసమాజ్ సభ్యులు

భీంగల్ సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షునిగా శెవ్వ అశోక్ నూతనంగా ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా మోహన్, ఉపాధ్యక్షుడిగా సందు గంగాదాస్, క్యాషియర్‌గా గంగం నరేష్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సర్వ సమాజ్ కమిటీ ఎన్నికలలో గంగాధర్‌పై అశోక్ గెలుపొందారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లా డుతూ.. భీంగల్ పట్టణ అభివృద్ధికి సర్వ సమాజ్ కమిటీ ద్వారా నిరంతరం పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

బాలికా సాధికారతకు విద్యే ఆయుధం

- సీడీపీవో సౌందర్య
- ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం
- పలు పోటీలు, బహుమతులు అందజేతల

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ సిటీ:జాతీయ బాలిక దినోత్సవం మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్ట్ వారు మైనార్టీ రెసిడెన్షియల్ ధరంపురి హిల్స్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ బాలిక సాధికారతను సాధించాలంటే విద్యను ఆయుధంగా వాడుకోవాలని అన్నారు. జిల్లా మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ బాలికలకు గల హక్కులు, రక్షణ చట్టల గురించి వివరించారు. ఐసిపిఎస్ కౌన్సిలర్ జమ్రు మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్, సేఫ్టీ, బాల్య వివాహల గురించి పిల్లలకు వివరించారు.కార్యక్రమంలో వివిధ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫీబా క్రిస్టినా, సూపర్వైజర్ ఫర్హత్, నందిని, వినోద తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్:మండల కేంద్రంలోని కస్తూర్బ గాంధీ బాలికా విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవానికి ఏఎస్ఐ పి. నర్సయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఎ రాజ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసుకున్నా, ప్రోత్సహించినా కూడా చట్టరీత్యా నేరస్థులు అవుతారని



ఆర్మూర్ : జెంటిల్ కిడ్స్ పాఠశాలలో..

తెలిపారు. బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎం. శ్రీనివాస్, ఆశావర్కర్లు శిరీష, జయశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణంలో జెంటిల్ కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవంలో కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపల్ లత లు మాట్లాడుతూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను రూపుమాపే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ అనే పేరుతో కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. అందులో భాగంగానే 2008లో స్త్రీ శిశు సంక్షేమ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలోని ప్రథమ మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, ప్రథమ మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ఇలా ప్రతి రంగంలో మహిళలు గొప్పవాళ్లుగా నిలిచారని వారిని గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని మామిడిపల్లి మిషనరీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవంత పాటు, పాటలు, డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఓ భార్గవి, ఏసీడిపి ఓ జ్యోతి, అంగన్వాడి సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

ఏర్గట్ల:మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మి విద్యార్థినులకు భేటి బచావో, భేటి పడావో గురించి అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన,


ఏర్గట్లలో..

చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఓ సంధ్యారాణి,అంగన్వాడీ, కస్తూర్బా టీచర్లు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే నిర్వహించినట్లు పాఠశాల ఎస్వో ఆర్.వినోద తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి హాజరై ప్రసంగించారు. విద్యార్థినులు ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా బాలికల ప్రాముఖ్యతను వివరించారు. బాలికల చదువు, మొదలగు అంశాలపై అవగాహనను కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.



టార్గెట్ కోసం నాటారు.. అడ్డంగా ఉన్నాయని నరికారు..

నవతెలంగాణ ధర్పల్లి

హరిత హారంలోభాగంగా నాడు అధికారులు తమ టార్గెట్ పూర్తిచేసేందుకు అనాలోచితంగా విద్యుత్ వైర్ల కింద మొక్కలను నాటారు. వాటిని నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగటంతో విద్యుత్ అధికారులు చేసేదేమిలేక బుధవారం తొలగించారు. అధికారులు ఆలోచించకుండా టార్గెట్ పూర్తి చేసేందుకు ఇలా చేయకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ పోస్టర్లను గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి జిల్లా నాయకురాలు సతెక్క పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో.. 12వేల769 గ్రామాలలో సుమారు 60వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. 2021 పిఆర్ సి నివేదిక ప్రకారం రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు 30 శాతం పిట్మెంట్ అమలు చేస్తూ జీవో 60ని విడుదల చేశారన్నారు. పారిశుద్ధ కార్మికులకు అన్ని మున్సిపాలిటీల్లో ఈజీవో ప్రకారం రూ.18వేల వేతనాలను అమలు చేయాలన్నారు. జీవో 60ని అమలు చేయక పోవడంతో నెలకు రూ.9500 మాత్రమే వేతనంగా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 34 రోజులుగా కార్మికులు సమ్మె చేసినప్పటికీ కేసిఆర్ ప్రభుత్వం నిరంకుశంగా సమ్మె డిమాండ్లను పరిష్కరించ లేదన్నారు. పంచాయతీ కార్మికులకు పని భద్రత కల్పించాలని, న్యాయమైన వేతనాలను పెంచడానికి తగు చర్యలకు పూనుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంలో జరిగే ఊరేగింపు, సభలో వేలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య అశోక్, రాజన్న, గంగు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- ఆర్మూర్ ఆర్డిఓ వినోద్
- తహసిల్దార్ కార్యాలయం తనిఖీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆర్మూర్ ఆర్డిఓ వినోద్ అన్నారు. తహసిల్దార్ కార్యాలయాన్ని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయంలోని రెగ్యులర్ పనులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ నుండి వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ కలీం, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ వికాస్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్, నాగరంలోని రాజా రామ్ స్టేడియంలో విశ్వ వికాస్ హైస్కూల్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా జిల్లా కోర్టు ప్రిన్సిపాల్ జడ్జి సునీత కుంచాల హాజరయ్యారు. ఆటలలో పాల్గొనేవారికి ప్రతిష్ట ప్రోత్సాహాన్ని జోడించారు. క్రీడలు, విద్య ద్వారా పాఠశాల సమగ్ర అభివృద్ధిని పెంపొందించడాన్ని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్‌లు టీమ్ స్పోర్ట్స్‌లో ప్రతిభను ప్రదర్శించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది అని అన్నారు. పాఠశాల విలువలను పరిరక్షించడం లో పాఠశాల యాజమాన్యం అంకితభావంతో పాటు విద్యార్థుల సంక్షేమం పట్ల నిబద్ధతను ఈ కార్యక్రమం నిరూపించిందని అన్నారు. విశ్వ వికాస్‌లో బలమైన కమ్యూనిటీ భావాన్ని హైలైట్ చేస్తూ ఉత్సాహంగా ఉత్సాహపరిచారని వివరించారు. కార్యక్రమంలో విశ్వవికాస్ ప్రిన్సిపల్ సుస్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న జడ్జీ, స్కూల్

డిచ్‌పల్లి ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా లక్కవత్రి నారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి


అధ్యక్షులు నారాయణ

డిచ్ పల్లి (ప్రింట్ మీడియా) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులందరూ ప్రత్యేకంగా సమావేశమై పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా నూతన అధ్యక్షుడిగా లక్కవత్రి నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా లోకాని గంగారాం, ప్రధాన కార్యదర్శిగా సామల మురళి, కోశాధికారిగా సంగి గోపాల్, ఉపాధ్యక్షుడిగా కట్టా శోభన్ బాబు, సహాయ కార్యదర్శిగా జేసీ సాయిలు, సలహాదారుగా సయ్యద్ నయీమోద్దీన్, ఈసీ మెంబర్ ఆర్.వసంత్ రావు రాథోడ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం విజేతలు వీరే

నవతెలంగాణ-బాల్కొండ

జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని బాల్కొండ నియోజకవర్గ స్థాయి పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించినట్టు మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. నియోజకవర్గంలోని బాల్కొండ , మెండోరా, ముప్కాల్, కమ్మర్పల్లి , మోర్తాడ్, ఏర్గట్ల, వేల్పూర్, భీంగల్ తదితర మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో విజేతలుగా ఉపన్యాస పోటీలలో కమ్మర్పల్లి మండలానికి చెందిన ఎండి ఫాయజాన్, పోచంపాడ్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని భార్గవి ద్వితీయ స్థానాన్ని సాధించారు. వ్యాసరచన పోటీల్లో సుహానా బేగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండ ప్రథమ స్థానాన్ని, ద్వితీయ స్థానాన్ని సంజన తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల పోచంపాడ్ విజేతలుగా నిలిచారు. వీరు గురువారం జిల్లా కలెక్టరేట్లో 10 గంటలకు రిపోర్ట్ చేయాలని ఎం ఈ ఓ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని సంబంధిత విద్యార్థులకు సమాచారాన్ని చేరవేయాలని కోరారు.


పోటీలో పాల్గొన్న విద్యార్థిని

ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోనిపడకల్ గ్రామ గురడి రెడ్డి సంఘ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గురడి రెడ్డి సంఘ సభ్యులు గుండేటి రాకేష్ రెడ్డి. బద్దం శ్రీధర్ రెడ్డి, వెల్మ సంతోష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గైండ్ల చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

వికలాంగునికి 50 వేల చెక్కు అందజేత

నవతెలంగాణ-ధర్పల్లి


చెక్కును అందజేస్తున్న ఎంపీపీ

మండలంలోని డిబి తండాకు చెందిన బి జీవన్ కు వికలాంగుల శాఖా ద్వారా మంజూరైన 50 వేళా చెక్కును బుధవారం ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అందించారు. కార్యక్రమంలో డిబి తండా ఎంపిటిసి గుగులోత్ స్వామి,బిఆర్ఎస్ మండల నాయకుడు ఎండి నజీర్, సంతోష్, రవి, రవీందర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ..

- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ బీజేపీ పార్టీని బలోపేతమే ధ్యేయంగా కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి తెలిపారు. ఎప్పటి కప్పుడు ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ బలో పేతానికి కృషి చేస్తానని అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లో జిల్లా అధ్యక్షులు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండి పోరాటం చేస్తూ ఒక జడ్పీటీసీగా ఎదిగిన తనను బీజేపీ పార్టీ అక్కున చేర్చుకుని ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించడమే కాకుండా నిజామాబాద్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు తనకు అప్పగించిన అధిష్టానానికి, నరేంద్ర మోడీకి అమిత్ షాక్, జాతీయ నాయకులు జెపి నడ్డా ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన తర్వాత తనకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకి అండగా ఉండడం కోసం పార్టీకి సేవలందించడానికి నిర్ణయం తీసుకున్నానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జీరో బడ్జెట్ తో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేయగా 50 వేల మెజార్టీ రావడానికి ప్రధాన కారణం కార్యకర్తల త్యాగమేనని గుర్తు చేశారు. ఈనెల 25న బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా పదాధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అందరూ హాజరై ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) 2024 క్యాలెండర్‌ను సిరికొండ నోడల్ అధికారి రాములు తహశీల్దార్ రవీందర్ రావు, ఎంపిడిఓ లక్ష్మి ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి రాములు మాట్లాడుతూ.. క్యాలెండర్‌లో సంస్కృతి పునరుద్ధరణ కు ప్రాణ త్యాగాలు చేసిన వీరుల జీవన చిత్రాలను వేయడం ద్వారా విద్యార్థులకు వారి జీవిత చరిత్ర ఘట్టాలు తెలుసు కోవడం ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాళ్ల రామడ్గు ప్రధానోపాధ్యాయులు భూపాల్ సింగ్, జెడ్ పి హెచ్ ఎస్ చీమన్ పల్లి హెచ్ఎం జవహర్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి నెల్ల రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచర్ల గంగాధర్, సిరికొండ మండలఅధ్యక్షులు దుబ్బాక నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్, మండల గౌరవ అధ్యక్షులు మోతిలాల్ మండల కార్యవర్గ సభ్యులు బాలాజి, సంఘ బాధ్యులు పాల్గొన్నారు

ఆదర్శలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్య సంవత్సరానికి గాను ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకోనున్నట్టు ప్రిన్సిపాల్ బి. శంకర్ బుధవారం తెలిపారు. ఈ దరఖాస్తులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రూ.125 చెల్లించి 22.02.2024 వరకు అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియం లో విద్యాబోధన, ప్రతి తరగతి కి 50 కి మించకుండా విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి , అగ్రికల్చర్, ఐటీ ట్రేడ్ వొకేషనల్ విద్యా ,ప్రతి సంవత్సరం బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు సెలెక్ట్ కావడం జరుగుతుందని తెలిపారు. పౌష్టికాహారం ఆహారంచ వసతి, ఉచిత యూనిఫాం, టెస్ట్ బుక్స్,నోట్స్ బుక్స్ అందిస్తారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 07.04.2024న మోడల్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆరోగ్య సేవలు విస్తృతం చేయాలి



● వైద్యాధికారి రోహిత్ కుమార్

నవతెలంగాణ-పిట్లం

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లలో ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని వైద్య అధికారి డాక్టర్ రోహిత్ సూచించారు. బుధవారం మండలంలోని తిమ్మానగర్, గోద్మేగావ్ గ్రామాల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాతా శిశుసంరక్షణ సేవలపై ఆరా తీశారు. అసంక్రమిత వ్యాధులకు టాబ్లెట్ పంపిణీ సక్రమంగా నిర్వహిస్తున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు, గర్భిణీలకు టీకాలపై చర్చించారు. అన్ని రకాల రుగ్మతలకు ఓపి చూస్తున్నారా లేదా అనే అంశాలపై పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో భూమయ్య, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఏఎస్ఎంలు వెంకటలక్ష్మి వసంత, ఎమ్ఎల్‌హెచ్‌పి సరిత, డాక్టర్ పూజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు

నవతెలంగాణ-జుక్కల్

ఆర్టీఏ, జుక్కల్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా వాహనదారులకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆటోవాలలకు, ద్విచక్రవాహనదారులకు రోడ్డు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వాహనదారులు వేగం తగ్గించి వాహనాలు నడపాలని, వాహన ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఏ గిజ్జ శ్రీనివాస్, జుక్కల్ ఎస్సై సత్యనారాయణ, ఏఎస్ఐ రమేష్, సిబ్బంది భాస్కర్, సూర్యకాంత్, ఖలీమ్, లింగురామ్, జుక్కల్ రెడ్‌క్రాస్ సభ్యులు సంతోష్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొక్కజొన్న, వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ

నవతెలంగాణ-రాజంపేట్

మొక్కజొన్న, వరి పంట సాగుచేసే రైతులు కాండం తొలుచు పురుగు మోగి పురుగు నివారణపై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ పేర్కొన్నారు. మండలంలోని తలమడ్ల గ్రామంలో బుధవారం వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాసంగి ప్రస్తుత వ్యవసాయ వాతావరణ పరిస్థితులు అలాగే సాగులో చేపట్టాల్సిన మెలకువల గురించి రైతులకు వివరించారు. ప్రధానంగా యాసంగి సీజన్లో వరి, మొక్కజొన్న, శనగ, కూరగాయ పంటలను ప్రధానంగా సాగు చేస్తున్నారని, ముఖ్యంగా వరి పంటలో అక్కడక్కడ మోగి పురుగు (కాండం తొలుచు పురుగు)ను గమనించారు. మొగి పురుగు గమనించిన వెంటనే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఒక ఎకరానికి 8-10కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 7-8కిలోలు ఇసుకలో సమనంగా కలిపి సాయంత్రం వేళల్లో చల్లుకోవాలని తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును 2గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పొలం అంతా సమానంగా పిచికారి చేయాలని ఆమె పేర్కొన్నారు. ముందుగా వేసిన వరి పొలంలో ఆకులపై చిన్నచిన్న గోధుమ వర్ణంలో బూడిద రంగు మచ్చలు గమనించామని తెలిపారు. రైతులందరూ లక్షణాలు గమనించిన వెంటనే ట్రైసైక్లోజోల్ అనే మందును 0.6 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో ఆకులు ముదురు నీలి రంగులోకి మారి వాడిపోతాయని, లోపం గమనించిన వెంటనే డిఎపి పోషక ఎరువును 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే ఎరువుల యాజమాన్యం కలుపుతీత క్రమక్రమంగా చేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్, వ్యవసాయ విస్తరణ అధికారులు మన్యుషా, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు

నెలకు 9రోజులే పని

● శివాజీ బీడీ కంపెనీ ముందు బీడీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజరాజేంద్ర చౌరస్తా వద్దగల శివాజీ బీడీ కంపెనీ ముందు బుధవారం 400 మంది బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న మాట్లాడుతూ... గత కొన్ని నెలలుగా శివాజీ బీడీ కంపెనీ యాజమాన్యం నాసిరకం తునికాకు, తంబాకు కార్మికులకు ఇస్తూ, నెలకు కేవలం 09రోజులు మాత్రమే పని కల్పిస్తుందని ఆరోపించారు. అవసరం మేరకు నాణ్యమైన తునికాకు, తంబాకు అందివ్వాలని, పని దినాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగివచ్చిన కంపెనీ మేనేజర్ వచ్చే నెలనుండి పనిదినాలు పెంచుతామని, మంచి తునికాకు, తంబాకు ఇస్తామని, వేజ్ స్లిప్పులు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, ఎం.సుధాకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్ యూనియన్ జిల్లా నాయకులు డి.సాయరెడ్డి, బి.మురళి, నాయకులు లలిత, చిన్నమల్లవ్వ భారతి, జమున, బుచ్చమ్మ, వినోద, రాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

తూములకు మరమ్మతులు చేయించాలి

● ఎమ్మార్వోకు వినతి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన ఊర చెరువు దానికి అనుబంధంగా ఉన్న మూడు తూములకు మరమ్మతులు చేయించాలని ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్ కు తొర్తి గ్రామానికి చెందిన గంగపుత్రులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయడం లేదని, దీని వల్ల నీరు కుడా బయటకు వెళ్ళడం లేదని, వర్షాకాలంలో కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని, నీరు కూడా కలుషితం అవుతుందని అన్నారు.



యాచకులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ



యాచకులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నందిపేట్

డొంకేశ్వర్ మండల కేంద్రము లోనీ పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై నిద్రించే యాచకులు, అనాథలు, వృద్ధులు, నిరు పేదలు, కూలీలకు బుధవారం డొంకేశ్వర్ గ్రామ క్రైస్తవ విశ్వాసులందరి తరపున బ్రదర్ నూతన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, ఆహారం, వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. అనంతరం వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చలికి బాధ బాధపడుతున్న వారిని గుర్తించి దుప్పట్లు అందజేశారు. ఇబ్బందులు పడకుండా పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో బ్రదర్ నూతన్, శోభన్, ప్రభాకర్, శ్రేయాస్ కుమార్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్బీ స్టేడియంలో హాజరుకావాలి

నవతెలంగాణ-రామారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండల బూత్‌లెవెల్ కాంగ్రెస్ ఇన్చార్జీలు గురువారం మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో హాజరుకావాలని జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్, కాంగ్రెస్ మండల ఇన్చార్జి నారెడ్డి మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సభకు, ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి పాల్గొని ప్రసంగించనున్నందున ప్రతి ఒక్కరు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయి, వేతనాలను మంజూరు చేయాలని మండలాధ్యక్షురాలు దేరడి లక్ష్మీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల నుంచి గౌరవ వేతనం రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్, ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి రామారావుకు విన్నవించినా అధికారులు సైతం బిల్లులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కిరాణా కొట్టులో ఉద్దెర సరుకులు తీసుకొచ్చి పాఠశాల విద్యార్థులకు వడ్డిస్తున్నామని ఆమె తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల బకాయి వేతనాలు రావాల్సి ఉందని ఆమె గుర్తు చేశారు.

మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



మాట్లాడుతున్న సోన్‌పేట్ నారాయణ

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు బుధవారం మండలం వేంపల్లి గ్రామంలోని చెరువు ఆయకట్టు వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.. ఈ సందర్భంగా సంఘ సభ్యులను ఉద్దేశించి మత్స్యసహకార సంఘం జిల్లా నాయకులు సొన్ పెట్ నారాయణ మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టే క్రమంలో ఎదురౌతున్న సమస్యలపైన చర్చించుకోవడం జరిగిందన్నారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం సభ్యులు, ఆయా గ్రామాల సంఘ పెద్దలు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా కలిగి ఉండాలి

నవతెలంగాణ-దోమకొండ

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలని ఎస్ఐ మురళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ ఆధార్ కార్డ్ నెంబర్, బ్యాంకు ఖాతా నెంబర్ ఇతర వివరాలు అడిగితే తెలుపవద్దని సూచించారు. తమ వ్యక్తిగత వివరాలు ఇవ్వాలని ఎవరైనా ఇబ్బందులు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌లు సుబ్రహ్మణ్యంచారి, లింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్‌తో ఆరోగ్యం

● రెడ్‌క్రాస్ మండల సొసైటీ చైర్మెన్ ఉమాకాంత్

నవతెలంగాణ-జుక్కల్

న్యూట్రిషన్ ఫుడ్ వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మెన్ డొంగ్రే ఉమాకాంత్ అన్నారు. బుధవారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా విద్యార్థినీలకు బాలికల దినోత్సవ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు సంబంధించిన చట్టాలను ఎస్సై సత్యనారాయణ వివరించారు. రోడ్డు భద్రతను పాటించాలని, ప్రమాదాలు తగ్గించాలని విద్యార్థినీలకు అవగాహన కల్పించి తమ కుటుంబ సభ్యులకు ఈ విషయాలు తెలియజేయాలని ఆర్టీఏ గిజ్జ శ్రీనివాస్ సూచించారు. పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తమవంతుగా విద్యార్థినిలకు బెల్లం, పల్లీలను అందజేశారు.



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థినికి సన్మానం..

కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని కే. శ్రద్ధ డివిజన్ పరిధిలో మూడవ ర్యాంకు పొందినందుకుగానూ, మండలంలో టాపర్‌గా గెలుపొందడంతో జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీఏ కానిస్టేబుల్ భాస్కర్, ఏఎస్ఐ రమేష్, సూర్యకాంత్, ఖలీల్, లింగురామ్, కేజీబీవి ప్రత్యేక అధికారిని అశ్విని, వైద్యసిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి పిరమిడ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

● మహేశ్వర మహా పిరమిడ్ కడ్తల్ ట్రస్టు సభ్యులు దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రతి ఒక్క వ్యక్తి పిరమిడ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని, పిరమిడ్ శక్తిని ఉపయోగించుకొని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కడ్తల్ మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్టు సభ్యులు దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అమీర్ నగర్ గ్రామ శివారులోని శివగుట్ట వద్ద గల విశ్వమాత పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద పౌర్ణమి ధ్యానాన్ని ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. పిరమిడ్ ధ్యాన మందిరాల నిర్మాణం గొప్ప విషయమన్నారు. పత్రీజీ ఆశయ సాధనలో ప్రతి ఒక్క రూపాలు పంచుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన 200 మంది ధ్యానులకు ధ్యానమృతం అందించారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నల్లగంగారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుండోజి నవీన్ కుమార్, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు బొడ్డు దయానంద్, కూనింటి శేఖర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ అశోక్, మురళి గౌడ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో వాలంటీర్లు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలు అక్షరాస్యులు, పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, మద్యపానం ధూమపానం వంటి అంశాలపై వాలంటీర్లు గ్రామస్తులతో కలిసి చర్చించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను చెత్తబుట్టలోనే వేయాలని వాలంటీర్లు గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక అవగాహన ఏర్పడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఐ.తిరుపతిగౌడ్, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఓటమితో కుంగిపోను.. గెలుపుతో పొంగిపోను

● మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

ఓటమితో కుంగిపోను.. గెలుపుతో పొంగిపోనని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని మర్కల్ స్టేజి వద్ద గల అశోక్ గార్డెన్‌లో ఉమ్మడి మండల పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓడినా గెలిచినా ప్రజల మధ్యనే ఉంటానని అన్నారు. 6 గ్యారెంటీలు చేతకాని, అమలు కానీ పథకాలని తెలిపారు. కార్యకర్తలు ఎప్పుడు ఓడిపోరని తెలిపారు. కొందరు ఓటర్లు కేసీఆర్ లేని రాష్ట్ర ప్రభుత్వాన్ని చూడలేకపోతున్నారని అన్నారు. పార్టీకి కొందరు నాయకులు మోసం చేశారని, కానీ కార్యకర్తలు మోసం చేయలేదని గుర్తుచేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను 70వేలకు పైగా మెజారిటీతోనే గెలిపిస్తామని అన్నారు. అనంతరం ఎంపీ బి.బి పాటిల్ మాట్లాడుతూ.. 'నన్ను గెలిపించండి. అభివృద్ధి చేస్తా'నని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లిపెల్లి మహేందర్‌రెడ్డి, భూంరెడ్డి, ఎం.పి.పి గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, కమలాకర్‌రావు, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి దశరథ్‌రెడ్డి, గడీల భాస్కర్, అల్తాఫ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ/మాచారెడ్డి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారుడుగా మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షులు ఆశ బోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తాగారి ముత్యంగౌడ్, సంజీవ్, బాల్‌రెడ్డి, ముత్తాగారి సిద్దగౌడ్, ముదం స్వామి, పట్నం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ : షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



మాచారెడ్డి :షబ్బీర్ అలీకి సన్మానం..

షబ్బీర్‌అలీని కలిసిన బంజపల్లి గ్రామ నాయకులు..

మాచారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం మహమ్మద్ షబ్బీర్ అలీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాలకు ప్రభుత్వ సలహాదారుడిగా నియమించడంతో బుధవారం బంజపల్లి గ్రామ నాయకులు షబ్బీర్ అలీని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు నవ్వీలాల్, గ్రామ అధ్యక్షులు విష్ణు నాయక్, ఎల్ఐసి మాన్సింగ్ నాయక్, కామారెడ్డి సోషల్ మీడియా ఇన్చార్జి అజ్మీర కళ్యాణ్, బొజ్జ శంకర్, మాన్య రమేష్, సజాన్, కలు లింగ, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు

● సత్యశోధక్ పాఠశాల

విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ


ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం కోర్బ జిల్లాలో ఈనెల 28 నుండి ఫిబ్రవరి 01వరకు జరిగే 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బేస్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు బుధవారం తెలిపారు. కె. రోహిత్ గత సంవత్సరం డిసెంబర్ 23 నుండి 25 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రుర్ జరిగిన రాష్ట్రస్తాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు చెప్పారు. జరిగింది. జాతీయ స్థాయికి ఎంపికైన కె. రోహిత్ ను ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. క్రీడా స్ఫూర్తిని, నైపుణ్యతను జాతీయస్థాయి పోటీలలో ప్రదర్శించాలని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే బాధపడొద్దు

● సిడిపిఓ సునంద

నవతెలంగాణ-మద్నూర్/రామారెడ్డి

ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులు బాధపడొద్దని.. వారిని చక్కగా చదివించాలని సిడిపిఓ సునంద అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, టీచర్స్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీలో బాలికల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సిడిపిఓ సునంద హాజరుకాగా ముఖ్య అతిథిగా స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సంగీత కుశాల్ పాల్గొన్నారు. సిడిపిఓ సునంద మాట్లాడుతూ.. బాలిక దినోత్సవం సందర్భంగా భేటీ పడావో భేటీ బచావో ప్రతి ఆడపిల్ల చదువుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల కోసం పుట్టిన నుంచి పెద్దగా అయ్యేవరకు చదువు పట్ల అన్ని రకాల వసతులు కల్పిస్తున్నదన్నారు. కాగా బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో మొక్కలను నాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, టీచర్లు కళావతి, చెంపబాయి, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : మొక్కను నాటుతున్న సీడీపీవో

రామారెడ్డి: మండలంలోని ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేసి మొక్కలు నాటారు. బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలకు ఎంపికైన మల్కాపూర్ (ఎం) పాఠశాల విద్యార్థినిని అభినందించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశా నుసారం తెలంగాణ గణిత ఫోరం నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో హరిచరణ్ మార్వాడి పాఠశాలలో ఈ నెల 23న నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభాపరీక్ష పోటీల్లో నిజామాబాద్ రూరల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్కాపూర్ (ఎం) కు చెందిన 10వ తరగతి విద్యార్థి మాగని నందకిషోర్ తెలుగు మీడియం విభాగంలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎన్. సూర్యనారాయణ తెలిపారు. బుధవార నందకిషోర్ ను,శిక్షణనిచ్చిన గణిత ఉపాధ్యాయుడు రాఘవాపురం గోపాలకృష్ణ ను ప్రత్యే కంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు సిరాజ్ హుస్సేన్, రమేష్, ఆనంద కుమారి, లక్ష్మ ణ్, సాయిలు, మధుకర్, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కి భారత రత్న ఇవ్వాలి

నవతెలంగాణ-బోధన్

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన నేషనల్ ఫ్రెంట్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నేత నందమూరి తారకరామరావుకు భారతరత్న పురస్కారాన్ని అందించాలని నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వి.హనుమంతరావు కేంద్రప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. తెలుగు జాతి గుర్తింపు కోసం కృషిచేసిన మహా నేతను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని, దక్షిణ భారత మహా నాయకుల పట్ల కేంద్రం ఉదాసీనవైఖరి చూపడం సరికాదని పేర్కొన్నారు. కళాకారునిగా ఎన్టీఆర్ అధిక చిత్రాలు నటించడంతో పాటు పౌరాణిక చిత్రాల్లో నటించి కలియుగ దైవంగా అభిమానులచే గుర్తింపు పొందిన ఎన్టీఆర్‌కు వెంటనే భారతరత్న పురస్కారానికి ఎంపిక చేయాలని కోరారు. అత్యధిక మంది ప్రజలు పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్‌ను భారత రత్న ఇచ్చి గౌరవించాలని కోరుతున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.